

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 219 | పేజీలు - 08 | వెల - 05/- | బుధవారం 05-08-2026


తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలం



## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

☛13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్

☛ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి

☛కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

2




భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా H-FAST (Hyderabad Food Adulteration Surveillance Team) బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు

# అగాధం నుంచి అభివృద్ధి వైపు..

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

**గత రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు**



● రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు వివరణ ● గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు చర్యలు ● రుణాల రీ-షెడ్యూల్ ద్వారా ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా ● వైసీపీ పాలనలో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టపోయిందని వెల్లడి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం నుంచి ప్రగతి పథం వైపు నడిపిస్తున్నామని, గత రెండేళ్లలో తీసుకున్న పటిష్ట చర్యలతో రాష్ట్రం అగాధం నుంచి అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టిన దిద్దుబాటు చర్యలను వివరిస్తూ ఆయన మంగళవారం 46 పేజీల 'ప్రోగ్రెస్ రిపోర్ట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కాలంలో సంక్షేమానికి రూ.1,49,401 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,33,917 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్ లెక్కలు, ఆర్థిక గణాంకాలు బ్రహ్మ పదార్థం కాదని, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ నివేదికను ప్రజల ముందు ఉంచుతున్నామని అన్నారు. "ఇంట్లో ఆదాయానికి తగ్గట్టు ఖర్చులు ఎలా చేస్తామో, రాష్ట్రానికి వచ్చిన ఆదాయాన్ని కూడా అంతే జాగ్రత్తగా అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు పెడుతున్నాం" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర విభజన నాటి కష్టాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కించామో, 2019 తర్వాత పాలనలో జరిగిన విధ్వంసం, తిరిగి అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంస్కరణలను సోదాహరణంగా వివరించారు.

**గత ప్రభుత్వ తప్పిదాలు.. ఆర్థిక నష్టం**

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు దారుణంగా మందగించిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో సగటున 13.5% జీఎస్డీపీ వృద్ధిరేటు సాధిస్తే, 2019-24 మధ్య అది 10.30 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఈ వృద్ధిరేటును కొనసాగించకపోవడం వల్ల రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల మేర జీఎస్డీపీని నష్టపోయిందని లెక్కలతో సహా వివరించారు.

మిగతాది 2లో

## విద్యుత్ ఛార్జీలు

### పెంచలేదు, ట్రూడౌన్ చేశాం: మంత్రి

● అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామన్న మంత్రి గొట్టిపాటి

● ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి

● పీఎం సూర్య ఘర్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలు చేస్తామని స్పష్టం

● జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శ



2

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ

## మెగా డీఎస్సీ-2025:

### పిటిషన్ పై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు

● మెగా డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో పిల్ ● క్రీడా కోటా నిబంధనలు మార్చి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆరోపణ ● అనర్హమైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో నియామకాలు జరిగాయన్న పిటిషనర్ ● వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణను మూడు వారాలకు వాయిదా



2

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల కోసం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన

# తెలుగుజాతి గర్వించేలా అమరావతి

**- చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది**

● మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత ● 2028 నాటికి నిర్మాణాలు పూర్తి ● అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల నివాసాలు ● జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు ● ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్న సీఎం చంద్రబాబు ● అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ : మంత్రి అనగాని



2

అమరావతిలి : తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028

## స్టేషన్ బెయిల్‌పై ఉదయనిధి విడుదల..

● ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు స్టేషన్ బెయిల్ ● విచారణ తర్వాత వెంటనే విడుదల చేయాలని హైకోర్టు ఆదేశం ● తంజావూరు జిల్లాలో గంటన్నర పాటు ప్రశ్నించిన పోలీసులు ● రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే శ్రేణుల నిరసనలు, ఆందోళనలు



తమిళనాడులో మంగళవారం రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్ర ప్రతిపక్ష నేత, డీఎంకే యువజన విభాగం చీఫ్ ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు ఈ ఉదయం అరెస్ట్ చేయడం తెలిసిందే. విచారణ అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. త్రిషపై డబుల్ మీనింగ్ వ్యాఖ్యల కేసులో విచారణ నిమిత్తం పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మద్రాస్ హైకోర్టు జోక్యంతో ఉదయనిధి స్టాలిన్‌కు ఊరట లభించింది. విచారణను మంగళవారమే ముగించి, ఆయనను విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు,

మిగతాది 2లో

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు: లోక్‌సభలో కేంద్రం వెల్లడి

**ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం**

● గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం ● గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం ● లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం ● మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు



2

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది.

## రేపల్లెలో టీడీపీకి షాక్!

☛రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం

☛వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు

☛గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్



బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు

## అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?

**: మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు**




☛బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ

☛మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు

☛జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్

☛పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్

☛తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య

బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు.పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ

మిగతా 2లో

# తెలుగుజాతి గర్వించేలా అమరావతి

అమరావతిలి : తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేశ్ తో ఆయనకేంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై మంత్రులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న ఉన్నత విద్యా వంతుడితో మంత్రి నారా లోకేశ్ తో ఆయనకు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా..? అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు పలికారు.

### 2028 నాటికి అమరావతి సిద్ధం : మంత్రి సవిత

తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబునాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు.

### జగన్ ది విధ్వంసం... మాది అభివృద్ధి...

ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని , తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్ ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు. నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్టేషన్ బెయిల్‌పై ఉదయనిధి విడుదల..

విచారణను మంగళవారమే ముగించి, ఆయనను విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు, తంజావూరు జిల్లా సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సుందరవదనం సమక్షంలో ఉదయనిధిని సుమారు గంటన్నర పాటు విచారించిన పోలీసులు, ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అప్పటికే ఆయన దాదాపు ఎనిమిది గంటల పాటు పోలీసుల అదుపులో ఉన్నారు. విడుదలైన అనంతరం, అక్కడ గుమిగూడిన డీఎంకే కార్యకర్తల భారీ స్వాగతం మధ్య ఉదయనిధి స్టాలిన్ బయటకు వచ్చారు. ఆయన ఒక బహిరంగ వాహనంలో నిలబడి పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. కాగా, పోలీసులు తనను అదుపులోకి తీసుకోకముందే ఉదయనిధి స్టాలిన్ తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. అంతకుముందు, ఉదయనిధిని తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్‌కు తరలించాలని పోలీసులు భావించారు. అయితే, అక్కడకు డీఎంకే కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో భద్రతా కారణాల దృష్ట్యా విచారణ స్థలాన్ని సెంగిపట్టికి మార్చారు. తొలుత ఈ మార్పును వ్యతిరేకించిన ఉదయనిధి, ఉన్నతాధికారులతో చర్చల అనంతరం విచారణకు సహకరించారు. ఈ అరెస్టును డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. అధికార టీవీకే ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ చర్యకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఉదయనిధి హాజరుకాకుండా అడ్డుకునేందుకే ఈ కుట్ర పన్నారని మండిపడ్డారు. ఉదయనిధి అరెస్టుకు నిరసనగా డీఎంకే శ్రేణులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టాయి. విచారణ నిమిత్తం ఆయనను చెన్నై నుంచి తంజావూరుకు తరలిస్తున్న క్రమంలో, మద్దతుదారులు పోలీస్ స్టేషన్లు మరియు ఇతర మార్గాల్లో భారీగా గుమిగూడి నిరసనలు తెలిపారు.

# మెగా డీఎస్సీ-2025: పిటిషన్ పై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు

వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు కేవలం కొన్ని పొరపాట్లు కావని, ఇది వ్యవస్థీకృత వైఫల్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం క్రీడా కోటా విధానంలో కీలక మార్పులు చేసిందని శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్రీడా కోటా రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారని, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా తొలగించారని తెలిపారు. ఈ మార్పుల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న కొందరు అభ్యర్థులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అర్హత లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆధారంగా పలువురు అభ్యర్థులు నియామకాలు పొందారని, దీనికి సంబంధించిన కొన్ని నమూనా సర్టిఫికెట్లను ఆయన కోర్టు ముందు ఉంచారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు బదులుగా, కేవలం స్థానిక పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లను ఉపయోగించారని వాదించారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం క్రీడా కోటాకు సంబంధించిన జీవోలను వెనక్కి తీసుకుందని, ఈ చర్యే విధానపరమైన మార్పులపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తాము చాలా సమాచారాన్ని సేకరించామని, ప్రభుత్వం పూర్తి మెరిట్ జాబితాను ప్రచురించనందున కొన్ని ఉదాహరణలను మాత్రమే కోర్టు ముందు ఉంచగలిగామని వివరించారు. ప్రభుత్వ చర్యలకు, బెదిరింపులకు భయపడి చాలా మంది బాధితులు కోర్టును ఆశ్రయించడం లేదని కూడా ఆయన తెలిపారు. ఈ అంశం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారానే దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు. వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

---

## అగాధం నుంచి అభివృద్ధి వైపు..

# ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

ఇదే సమయంలో తెలంగాణతో తలసరి ఆదాయంలో వ్యత్యాసం భారీగా పెరిగిపోయిందని, 2018-19లో రూ.55,817గా ఉన్న ఈ గ్యాప్, 2023-24 నాటికి రూ.1,06,854కు పెరిగిందని పేర్కొన్నారు. సరైన ప్రణాళికతో ముందుకెళ్లి ఉంటే, 2025-26 నాటికి ఏపీ తలసరి ఆదాయం రూ.3,67,115గా ఉండేదని, కానీ గత ప్రభుత్వ విధానాల వల్ల అది రూ.2,94,507కే పరిమితమైందని, తద్వారా ప్రతి వ్యక్తి రూ.72,608 మేర ఆదాయాన్ని కోల్పోయారని విశ్లేషించారు.

దిద్దుబాటు చర్యలు.. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్

2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి ఉన్న రూ.48,616 కోట్ల పెండింగ్ బిల్లులకు గానూ, ఇప్పటికే రూ.19,357 కోట్లు చెల్లించినట్లు సీఎం వెల్లడించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, సీపీఎస్, పీఎఫ్ వంటి బకాయిల్లో రూ.30,849 కోట్లకు మోక్షం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం పెండింగ్‌లో ఉన్న రూ.8,695 కోట్లను కేంద్రానికి జమ చేసి, వినియోగ ధ్రువపత్రాలు (యూసీలు) సమర్పించామని చెప్పారు. దీని ఫలితంగా రాష్ట్రంలో రూ.45,138 కోట్ల అభివృద్ధి పనులు సాధ్యపడగా, ఇందులో కేంద్రం వాటాగా రూ.29,890 కోట్లు అందిందని వివరించారు. స్థానిక సంస్థలకు చెల్లించకుండా నిలిపివేసిన ఆర్థిక సంఘం నిధులను కూడా విడుదల చేశామని, పెండింగ్ బిల్లులతో కలిపి మొత్తంగా రూ.7,404 కోట్లను స్థానిక సంస్థలు, వైద్యారోగ్య రంగానికి బదలాయించామని తెలిపారు.

రుణాల భారం తగ్గింపు.. భారీ ఆదా

అధిక వడ్డీలకు తీసుకున్న అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రుణాల రీ-షెడ్యూల్‌పై దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. రూ.1.50 లక్షల కోట్ల విలువైన 370 రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించేలా బ్యాంకర్లతో చర్చలు జరిపి విజయం సాధించామన్నారు. 13% వడ్డీ ఉన్న రుణాలను 10.90 శాతానికి, 9.9% వడ్డీ ఉన్నవాటిని 9.1 శాతానికి, 8% వడ్డీ ఉన్న రుణాలను 7.7 శాతానికి తగ్గించామన్నారు. ఈ చర్యల ద్వారా ఏటా రూ.1,100 కోట్లు ఆదా అవుతోందని, మొత్తం మీద ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా అయిందని పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

గత రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ కాలంలో వివిధ పథకాల ద్వారా రూ.1,49,401 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఎన్టీఆర్ భరోసా -- రూ.68,296 కోట్లు విద్యుత్ సబ్సిడీ -- రూ.32,800 కోట్లు తల్లికి వందనం -- రూ.20,210 కోట్లు అన్నదాత సుఖీభవ -- రూ.8,724 కోట్లు ఎన్టీఆర్ వైద్యసేవ -- రూ.5,921 కోట్లు బియ్యం సబ్సిడీ -- రూ.4,322 కోట్లు దీపం 2.0 -- రూ.3,724 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ -- రూ.1,529 కోట్లు స్త్రీశక్తి -- రూ.1,520 కోట్లు ధరల స్థిరీకరణ నిధి -- రూ.1,200 కోట్లు వీటితో పాటు ఉద్యోగాల భర్తీపైనా దృష్టి సారించామని, ఇప్పటికే 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మెగా డీఎస్సీ-2025 ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నామని ప్రకటించారు. అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి రాష్ట్రంలో మూలధన వ్యయాన్ని పెంచడం ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యమని చంద్రబాబు అన్నారు. గత రెండేళ్ల సగటు మూలధన వ్యయం, 2019-24 మధ్య సగటు వ్యయంతో పోలిస్తే 1.5 రెట్లు అధికమని తెలిపారు. అమరావతి రాజధాని పనులకు (2024-26) -- రూ.10,057 కోట్లు పోలవరం ప్రాజెక్టుకు -- రూ.8,323 కోట్లు పోర్టులకు -- రూ.5,437 కోట్లు రైల్వేల అభివృద్ధికి -- రూ.64,417 కోట్లు జాతీయ రహదారులకు -- రూ.38,800 కోట్లు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో రూ.1.78 లక్షల కోట్లతో 390 ప్రాజెక్టుల అమలుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వీటికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద చేయూతనిస్తామని సీఎం వివరించారు. ఇప్పటికే 10 పీపీపీ ప్రాజెక్టులకు రూ.1850 కోట్ల వీజీఎఫ్ ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. ఆదాయం-జీతాల వ్యయంపై విశ్లేషణ 2014-19 మధ్య రాష్ట్ర ఆదాయంలో 87% జీతాలకు ఖర్చు కాగా, 2019-24 మధ్య ఆదాయాలు పడిపోయి, జీతాల ఖర్చు 110 శాతానికి చేరిందని, అందుకే గత ప్రభుత్వం జీతాలు కూడా సరిగా చెల్లించలేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు: లోక్‌సభలో కేంద్రం వెల్లడి

ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం: మంత్రి

అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 'ట్రూ డౌన్' చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని, సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు

# రేపల్లెలో టీడీపీకి షాక్

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

## అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఎ-ఖీూూ బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## టీటీడీ అగరబత్తుల పేరిట మోసం.. ఈ-కామర్స్ సైట్లపై చర్యలకు భక్తుల డిమాండ్

తిరుమల శ్రీవారి భక్తులను లక్ష్యంగా చేసుకుని కొన్ని ఈ-కామర్స్ సైట్లు మోసాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీటీడీ అనుమతి లేకుండానే శ్రీవారి పేరుతో అగరబత్తులను మూడింతల ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో భక్తులు అధిక ధరలు చెల్లించి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. టీటీడీ అధికారిక అనుమతి లేకుండా శ్రీవారి పేరును ఉపయోగిస్తూ విక్రయాలు జరుపుతున్న ఈ-కామర్స్ వేదికలపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారికంగా అనుమతించిన మార్గాల ద్వారానే టీటీడీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని భక్తులకు సూచనలు చేస్తున్నారు.

# నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా శ్రీ మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుక.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నిజాయితీ, అంకితభావంతో తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త, రాజకీయ నాయకుడు,మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకను నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సంధర్భంగా జిల్లా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజాసేవే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన ఉన్నతమైన వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలు పాటించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. ఉన్నత పదవుల్లో ఉన్నా సామాన్యుడిలా జీవిస్తూ ప్రజలకు సేవ చెయ్యడం పరమావదిగా భావించి నేటి రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సంధర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ... దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ముందుండి సేవలందించిన ఆయన, వేలాది కుటుంబాలకు అండగా నిలిచారని, ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా "దివిసీమ గాంధీ" అనే బిరుదును పొందారన్నారు. ఈ కార్యాక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ బాష, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ ఏ ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు , డి పి ఓ అదికారులు వీరన్న ,ఖాదర్ బాష ,కవిత ,రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు,విజయ్,సురేష్ ఆర్.ఎస్.ఐ హర్షవర్ధన్ రెడ్డి మరియు చరణ్ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# ఉలిందకొండ పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి -- జిల్లా ఎస్పీ
- సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయండి .



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఉలిందకొండ పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలిం చారు. పోలీస్ స్టేషన్‌లో నమో దైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు.ప్రాపర్టీ కేసులను చేధించి రికవరీలు చేయాల న్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించి నప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల పై జరిగే నేరాల గురించి, మహిళల రక్షణ చట్టాల పై ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు. జిల్లా ఎస్పీ తో పాటు కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి ఉన్నారు.

# తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలం

దొర్నిపాడు ఆగస్టు 4 పల్లె వెలుగు న్యూస్ పుట్టిన ప్రతి పిల్లకుతల్లిపాలతో ఆరోగ్యం





పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభాకరమ్మన్నారు,ఆగస్టు 1నుండి 7వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరానగర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రం నందు టీచర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణీ స్త్రీలతోసమావేశంనిర్వహించారు,ఈ సందర్భంగవారు మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు తల్లిపాలు తాగిన పిల్లలకు రోగనిరోధకశక్తిపెరుగుతుందన్నారు, అనారోగ్యానికి పిల్లలు గురికారని వారు తెలియజేశారు అంతేకాకుండా ముర్రుపాలు తాగిన పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయన్నారు పుట్టిన అరగంటలోపే బిడ్డకు తల్లిపాలు అందించాలన్నారు ఆరు నెలల తర్వాత కేంద్రాల ద్వారా అందించే బాలామృతాన్ని ఇవ్వాలన్నారు, పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు పూర్తి అయ్యేవరకు తల్లిపాలు ఇవ్వాలని వారన్నారు, తల్లిపాల వల్ల పిల్లలలో పెరుగుదల ఉంటుందన్నారు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలను కేంద్రాలకు పంపించాలన్నారు అంగన్వాడి కేంద్రాలలో కార్పొరేట్ పాఠశాలల కన్నా ఉత్తమ విద్య పోషకారాన్ని అందించి విద్యను బోధిస్తున్నారు అన్నారు, ఈ కార్యక్రమంలో టీచర్ మంజుల ఆయనాగేశ్వరి చిన్నారులతల్లిదండ్రులుచిన్నారులుపాల్గొన్నారు

# ఆటోనగర్ స్థలాల అవకతవకల నేపథ్యంలో మృతిచెందిన వెల్డర్ నిసార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎస్ డి పి ఐ నాయకులు.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆటోనగర్ స్థలాల వ్యవహారంలో చోటుచేసుకున్న అవకతవకల కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మృతిచెందిన వెల్డర్ నిసార్ కుటుంబాన్ని ఎస్ డి పి ఐ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిసార్‌కు 3 సంవత్సరాల చిన్నారి కుమార్తెతో పాటు కేవలం 20 రోజుల పసికందు ఉన్నారని, నిసార్ సంపాదనపైనే ఆ కుటుంబం పూర్తిగా ఆధారపడి జీవించేదని తెలిపారు. ప్రస్తుతం కుటుంబం అత్యంత దయనీయ పరిస్థితిలో ఉందని పేర్కొంటూ, నిసార్ భార్యకు మరియు చిన్నారులకు ప్రభుత్వం వెంటనే తగిన ఆర్థిక సహాయం అందించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే, నిసార్ మరణానికి పరోక్షంగా కారణమైన వారిని గుర్తించి, వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ జిల్లా నాయకులు ఎజాస్ హుస్సేన్, టి. కరీముల్లా, సుల్తాన్, లింకన్ రాజు, అసెంబ్లీ నాయకులు మాజీద్ ఖాన్, కరీముల్లా, రిజ్వాన్, యున్యూస్, ఫయాజ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో సబ్సిడీ బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. సామాన్య, నిరుపేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకే అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్' (ఎంఐపి) ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిందని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈరోజు నంద్యాల శ్రీనివాస్ నగర్‌లోని రైతు బజార్ (టీటీడీ కల్యాణ మండపం సమీపంలో) బియ్యం తగ్గింపు ధరల విక్రయ కేంద్రాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ సూరజ్ ధనంజయ్ గనోర్ ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కత్తిరించి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ స్టీమ్ బియ్యం (బీపీటీ) కిలో రూ. 52 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ. 62 రూపాయలు ఉంది), రా బియ్యం (బీపీటీ) కిలో రూ. 50 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ. 58 రూపాయలుగా ఉంది). ఈ సబ్సిడీ బియ్యం పథకం రేషన్/బియ్యం కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వర్తిస్తుందని తెలిపారు. బియ్యం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు తమ ఆధార్ నంబరును తప్పనిసరిగా తెలియజేయాలని. ఒక బియ్యం కార్డుకు నెలకు గరిష్టంగా 10 కిలోల బియ్యం మాత్రమే అందజేయబడుతుందని అన్నారు. నంద్యాల జిల్లాలో 2 రైతు బజార్లలో మరియు 3 గుర్తించిన రైస్ మిల్ అవుట్‌లెట్లలో ఆగస్టు 4 నుండి విక్రయాలు ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేయకూడదని అన్నారు . నిబంధనలకు లోబడి అత్యంత నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని నాసిరకం బియ్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయిని తెలిపారు . కేంద్రంలో ధరల పట్టిక, స్టాక్ వివరాలు, పని వేళలు స్పష్టంగా ప్రదర్శించాలని వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్టాక్ నిరంతరం అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఆర్డీవో విశ్వనాథ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వోలు శ్రీనివాసులు, శ్రీవాణి, ది నంద్యాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ (సివిల్ సప్లైస్) అధికారులు, రైతుబజార్ అధికారులు మరియు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నంద్యాల 36వ వార్డులో వైభవంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'.

**ప్రజల ముంగిటకే కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి: మంత్రి ఎన్ఎండి ఫరూక్.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కూటమి ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. స్థానిక 36వ వార్డ్ రైతుబజార్ పరిసర ప్రాంతాలలో టిడిపి వార్డు ఇంఛార్జి మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుంటున్నాం అన్నారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని . యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు మన కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు . చంద్రన్న సంక్షేమ పాలనపై నంద్యాల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని అన్నారు . ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి నంద్యాల ప్రజలు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారని మంత్రి ఫరూక్ తెలిపారు . ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, వార్డు నాయకులు సుధీర్, పుల్లయ్య, శేఖర్ రెడ్డి, సునీల్, దాసు, చంటి, శేఖర్, మంజుల సుబ్బరాయుడు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి జన్మదిన వేడుకలు..



పాణ్యం ఆగస్టు 4 పల్లె వెలుగు : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోనీ నాలుగు రోడ్ల కూడలి నందు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు.టీడీపీ నాయకులు ఎంపీటీసీ రంగా రమేష్,లాయర్ బాబు,ఎస్సీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని బాణాసంచా కాల్చి,భారీ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు.

● నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన సదస్సు. ● నెరవాటి ఆసుపత్రి సౌజన్యంతో పండ్లు, బ్రెడ్లు పంపిణీ. ● తల్లిపాల ప్రాముఖ్యతపై కరపత్రాల ఆవిష్కరణ.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల లయన్స్ క్లబ్,ఐఎంఏ మహిళా విభాగం సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి తల్లీ బిడ్డల ప్రత్యేక విభాగంలో మంగళ వారం తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన,నెరవాటి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ వినోద్,డాక్టర్ నెరవాటి అరుణ కుమారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర,ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ జి.రవికృష్ణ అతిధులుగా పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టత పై డాక్టర్ అరుణ కుమారి,డాక్టర్ పద్మజ , నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాజ్యలక్ష్మి,డాక్టర్ సుధా వాణి,డాక్టర్ వసుధ, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య,నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, నంద్యాల మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ సునీత, డాక్టర్ రజని,డాక్టర్ ఫాతిమా,డాక్టర్ నిత్య, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ తనూజ, డాక్టర్ అనూష గర్భవతులకు,చంటి బిడ్డల తల్లులకు తల్లిపాల వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత పై గత 20 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.లయన్స్ క్లబ్ కార్య దర్శి మేడా చంద్రశేఖర్,కోశాధికారి సురేష్, జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సంయుక్త కార్యదర్శి అమిదేల జనార్ధన్, సభ్యులు పాలూరు ప్రశాంత్, కిరణ్, జగన్,తదితరులు పాల్గొని 200 మంది గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తల్లీ పాల ఆవశ్యకత గురించి రూపొందించిన కర పత్రాలు విడుదల చేసి తల్లులకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ, చిన్న పిల్లల వైద్య విభాగ వైద్యులకు, తల్లిపాల ప్రాముఖ్యతపై మాట్లాడిన వైద్యులకు లయన్స్ క్లబ్ జ్ఞాపికలు అందించి సత్కరించారు.

# కోటవీధి శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి దేవస్థాన నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం.

-ఆలయ భూముల పరిరక్షణపై ధర్మకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి మంత్రి ఫరూక్ పిలుపు.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆలయాల అభివృద్ధికి మరియు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం తరఫున పూర్తి తోడ్పాటు అందిస్తామని రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాల పట్టణం, కోటవీధిలోని కౌకుంట్ల లక్ష్మయ్య గంద్రకోట సుబ్బమ్మ అన్నదాన సత్రం మరియు శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణస్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఛైర్మన్ గా చాటకొండ సత్యనారాయణ, పాలకమండలి సభ్యులు (ధర్మకర్తలు) లుగా లక్ష్మీదేవి, నందిని బాయి, సుధారాణి, దండు సత్యం, సత్యనారాయణ, అల్లూరయ్య (అల్లు రావు), మంజులా బాయి, మిద్దె రాంప్రసాద్, ఎక్స్ ఆఫీసియో సభ్యులుగా అర్చకులు ప్రసన్న కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ స్వామివారి సేవ చేసుకునే భాగ్యం దక్కించుకున్న నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఆస్తులు, భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంలో ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, కందుకూరి శ్రీరామమూర్తి , చలం బాబు , సురేష్, పబ్బతి వేణు , బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, సుబ్బలక్ష్మయ్య, దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి (ఈఓ), దేవాదాయ శాఖ సిబ్బంది, సేవా సమాజ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# తడి-పొడి విధానంతో వరిలో నీరు ఆదా





బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 4 :బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న చిన్న దేవలాపురం, నారాయణపురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ,వరి సాగులో తడి పొడి పద్ధతిలో క్రమంగా నీరు పెట్టడం మరియు ఆర బెట్టడం ద్వారా నీరుని ఆదా చేస్తూ, మిథేన్ విషపు వాయువు రాకుండా నివారించవచ్చని అన్నారు. ఈ పద్ధతిలో వరి నాటు వేసిన అనంతరం 15 రోజులు మాత్రమే నీరు అందించి తదుపరి 15 రోజులు ఆరబెట్టడం ద్వారా వరి దుబ్బలు మరియు కంకుల సంఖ్య అధికంగా ఉంటూ తక్కువ నీటితో మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన వర్షభావ పరిస్థితులలో మెట్ట సాగు చేసిన పంటలను కాపాడు కోవడానికి రైతులు ఒక లీటర్ నీటికి 20 గ్రాముల చొప్పున యూరియా కలిపి కానీ (లేదా) పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని కానీ పిచికారి చేసుకొని తాత్కాలికంగా పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా పంట ఇంకా వేయని రైతులు తక్కువ కాల పరిమితి మరియు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఇస్తున్న వాతావరణం సమాచారాన్ని బట్టి పంటల సాగు చేసుకోవాలని, బెట్ట వాతావరణ పరిస్థితులను తట్టుకొనే కొర్ర, ఉలవలు, జొన్న వంటి పంటలు వేసుకోవాలని తెలపడం జరిగింది అదేవిధంగా రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం లాంటి విధానాలను పాటించాలని, రైతులు అధిక మోతాదులో రసాయానికి ఎరువులు వాడకుండా, భూసార పరీక్ష ఫలితాలు అనుసరించి ఎరువులు వేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చెరువులు నిండి సాగు నీరు పారుదల వచ్చే అవకాశం తక్కువగా ఉందని కాబట్టి రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా ఇప్పటికి పంటల బీమా నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని రైతులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఓ కోరారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను వ్యవసాయ అధికారి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు వెటర్నరీ డాక్టర్ అనూష, వ్యవసాయ విస్తరణ సిబ్బంది లక్ష్మయ్య, చక్రధర్ రెడ్డి, అస్సెస్ కంపెనీ ప్రతినిధి వెంకట సాయి పలువురు రైతులు పాల్గొన్నారు.

# త్రాగునీటి కోసం అలమటిస్తున్న ఎద్దు పెంట ప్రజలు

నంద్యాల జిల్లా డోన్ మండలం ఎద్దుపెంట గ్రామం దళిత కాలనీ వాసులకు మంచి నీరు




కోసం 3నెలలు నుండి అవస్థలుపడుతున్నారు పరిష్కారం చేయడం లో అధికారులు విఫలం, టీడీపీ వాళ్ళు కి బిల్లుల కోసం ట్యాంకర్లు తో అరకొర గా సరఫరా! శాశ్వత పరిష్కారం కోసం సిపిఐ సచివాలయం ముట్టడి నీటి సమస్య పరిష్కారం చేయకపోతే డోన్ మండల ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తాం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, నారాయణ డిమాండ్. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, సిపిఐ నాయకులు కోయాలకొండ నాగరాజు, రైతు సంఘము కార్యదర్శి వరదరాజులు, ఖఐఎట కార్యదర్శి పృథ్వి కుమార్, గ్రామ సీనియర్ నాయకులు ఓబుళపురం వెంకట్రాముడు, జయరాముడు, సాంటే సుధాకర్, యాపదీన్నే శాఖ కార్యదర్శి పాపా రాయుడు, తదితరులు పాలొగొన్నారు

# అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 4: బండి ఆత్మకూరు అంగన్వాడి కేంద్రంలో 6 లో మంగళవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఒక సమావేశంలో అంగన్వాడీ టీచర్లు సునీత,నాగరాజమ్మ, ఆనందమ్మలు మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. తల్లిపాలతో పాటు ఆరు నెలల తరువాత అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే బాలామృతాన్ని ఇవ్వాలని అన్నారు. బిడ్డకు రెండు సంవత్సరములు పూర్తి అయ్యేవరకు తల్లిపాలను కొనసాగించాలని అన్నారు. తల్లిపాల వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు, మెదడు ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. దీనితోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ముర్రు పాలు తాగిన పిల్లలలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. బిడ్డకు ముర్రుపాలను తాగించడం వలన త్వరగా జీర్ణమవడం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా తల్లి బిడ్డల మధ్య ఆప్యాయత అనుబంధం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల యొక్క ఆవశ్యకతను గురించి ఏర్పాటుచేసిన కరపత్రాలను అంగన్వాడి టీచర్లు విడుదల చేశారు.

# తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం. అంగన్వాడీ టీచర్లు





మహానంది, పల్లె వెలుగు తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం అని అంగన్వాడీ టీచర్లు లక్ష్మీనారాయణమ్మ, మహేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీ, మెట్ట వద్ద అంగన్వాడి కేంద్రాల్లోప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తల్లిపాలే పిల్లలకు అమృత తుల్యమని, బిడ్డ శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పడతాయి అన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగేలా చూడాలన్నారు. తల్లి ఇచ్చే పాలల్లో రోగ నిరోధక శక్తి పెంచే అంశాలు ఉంటాయని, బిడ్డ పలు రకాల వ్యాధుల బారిన పడకుండా ఎంతగానో దోహదపడుతుందన్నారు.ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే అందించాలని, తర్వాత మంచి పౌష్టికాహారిన్న ఇవ్వడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన ప్రోటిన్లు, పోషకాలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలన్ని సమతుల్యంగా తల్లిపాలల్లో లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ రమేష్, మహిళా పోలీస్ రమాదేవి, ఆశా వర్కర్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై చేయి చేసుకోవడం హేయం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 4 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్న



పాడు గ్రామంలోని మూడు రోజుల క్రితం ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు చేయి చేసుకోవడాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఖండించారు. మాలిక నువ్వు కొట్టడం హేయమని పేర్కొన్నారు. ఈ విషయాన్నికి సంబంధించి మండల విద్యాశాఖ అధికారిణి యశోదకు మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సంఘటనపై నరేందర్ స్కూలు యాజమాన్య బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్పి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసుబ్బన్న, మాజీ మండల అధ్యక్షులు అడ్డాకుల శివ, మండల అధికార ప్రతినిధి పాలుట్ల సురేష్ ఎం ఎస్ పి జిల్లా నాయకుడు మండల నాయకులు మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి--శిశు ఆరోగ్య సంరక్షణకు ఆశా కార్యకర్తలు కీలకం -- తొట్టిగారిపల్లిలో ఆశా సమావేశంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్

బద్వేల్ , ఆగస్టు 4:(పల్లె వెలుగు )బద్వేల్ మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ నెల అజెండాలో భాగంగా తల్లిపాల వారోత్సవాలు, నవజాత శిశు సంరక్షణ, ప్రభుత్వం




అందజేస్తున్న నవజాత శిశు కిట్ల ప్రాముఖ్యతపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏవైనా ఆరోగ్య లోపాలు గుర్తిస్తే వెంటనే మెడికల్ ఆఫీసర్లకు సమాచారం అందించాలని సూచించారు. మాతా--శిశు సంరక్షణలో ప్రతి గర్భిణీ, బాలింత మరియు చిన్నారుల ఆరోగ్యంపై ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. గ్రామాల్లో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా చంద్రన్న చికిత్స, 108 అంబులెన్స్, తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు, సంక్రమణ వ్యాధుల సర్వే, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (=దీూఖ) ద్వారా ప్రతి చిన్నారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ మరియు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రావతి, హెల్త్ సూపర్వైజర్ సులోచన, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్దన్ రావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరి పంటలో ఎకరాకు ముడి జింకు వాడాలి

మహానంది, పల్లె వెలుగు వరి పంటలో ఎకరాకు ఇరవై కిలోల ముడి జింకు తప్పనిసరిగా వాడాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం







నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు, భాస్వరం ఎరువులు వాడరాదన్నారు. ముడి జంకును భాస్వరం ఎరువులతో కలిపి వాడరాదని, వరి నారు వేర్లను సూడోమోనాస్ ద్రావణంలో ముంచి నాటుట ద్వారా అగ్గి తెగులును నివారించుకోవచ్చు అన్నారు. వరి నారు కొసలను తుంచి నాటుట ద్వారా కాండం తొలుచు పురుగును నివారించుకోవచ్చు అని, వరి నారు ను ఆలస్యంగా నాటుకున్నట్లైతే ఎకరానికి 20 నుండి 25 కేజీలు నత్రజనిని అదనంగా వేసుకోవాలన్నారు. పంట వేసిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి పంట నమోదు చేయించుకోవాలని, ఈనెల 15లోగా వరి, మొక్కజొన్న, మినుము పంటలకు పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ ఉద్యాన అధికారి సుభాష్ చంద్రబోస్, రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

- నీటి నమూనాల పరీక్షలు, భూగర్భ జలాల పెంపుపై ఆదేశాలు
- జల్ జీవన్ మిషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన త్రాగునీరు అందించడంతో పాటు భూగర్భ జలాలు, నీటి నిల్వలను గణనీయంగా పెంచేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆర్డబ్ల్యూఎస్ (=ఔా) సూపరింటెండింగ్ ఇంజనీర్ (ాజు) మనోహర్‌ను ఆదేశించారు. కేంద్ర జల్ జీవన్ మిషన్ అడిషనల్ సెక్రటరీ కమల్ కిషోర్ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: నీటి నాణ్యతా పరీక్షలు: వర్షాలు పడకముందు, పడిన తర్వాత జిల్లాలోని అన్ని నీటి వనరుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షలు జరపాలి. అందులోని రసాయనాలను గుర్తించి, ఆ నీరు ప్రజల వినియోగానికి యోగ్యంగా ఉండేలా తగిన శుద్ధి చర్యలు చేపట్టాలి. కలుషిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా పారిశ్రామిక వాడలు, వ్యర్థాల డంపింగ్ యార్డుల సమీపంలోని నీటి వనరులతో పాటు చెరువులు, చెక్ డ్యామ్‌లు, బోరు బావుల నీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలి. భూగర్భ జలాల పెంపు: ప్రస్తుత వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలి. ఇతర శాఖల సమన్వయంతో ఇంకుడు గుంతలు (=ఖఱఅష్ఠ్‌వతీ ఝితీజవర్‌ఱఅస్త్ర హ్‌తీబష్ట్‌బతీవం), చెక్ డ్యామ్‌లు, ఫారం పాండ్స్, మరియు 'విబిజి రాంజీ' పనుల ద్వారా నీటి నిల్వలను, భూగర్భ జలమట్టాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలి.

## పారిశుధ్యాన్ని పట్టించుకునే వారే లేరా

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 4: ఎందరు అధికారులు ఉన్నా పారిశుద్ధ్యం





గ్రామాలలో పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించండి. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించండి అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు, పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ లు పదేపదే క్రింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ అధికారులు లెక్కచేయడం లేదు అనిపిస్తుంది. ప్రతి గ్రామానికి స్పెషల్ ఆఫీసర్, ప్రతి సచివాలయానికి పంచాయతీ కార్యదర్శి, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కు డిప్యూటీ ఎంపీడీవో, పర్యవేక్షణకు ఎంపీడీవో, ఇలా... విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదు. ప్రతి నెల మూడవ వారంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, ప్రతి బుధవారం స్వచ్ఛ పథం పేరుతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ అవికూడా తూ తూ మంత్రాంగానే సాగుతూ ఉన్నాయి. బండి ఆత్మకూరు మండలంలో అనేక గ్రామాలలో పారిశుద్ధ్యం విషయంలో కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండి ఆత్మకూరులో ఓ ప్రాంతంలో వారం రోజులుగా పారిశుధ్య పనులు జరగటం లేదు. హరిత రాయబారులు ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయబార్లు రాక కోసం ఎదురుచూపులు చూస్తున్న ప్రజలు, స్వచ్ఛందంగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకొని, చెత్తాచెదారాన్ని ఎత్తుకొని పారేసుకుంటున్నారు. ఇదే గ్రామంలో ఆరవ వార్డులోని కుమ్మరిపేటలో ఏళ్ల తరబడి నుండి ప్రజలు మురుగునీటితో సహవాసం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్డుపై నాలుగు, ఐదు రోజులపాటు వర్షపునీరు రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోతూ ఉంది. ఈ విషయాన్ని అధికారులకు ఎన్ని మాటలు చెప్పినప్పటికీ చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగా తయారైంది. ఇదే విషయంపై సోమవారం నాడు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కొందరు అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి పోయారు తప్ప, సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఇప్పటికే దోమలతో సహవాసం చేస్తున్న ప్రజలు, రోడ్లపై వర్షపు నీళ్ళు నిల్వ ఉండి పోస్తు ఉండటంతో చాలా గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుధ్యం విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు బలోపేతం లో టి. షడ్రక్ పాత్ర అమోఘం.

### టి.షడ్రక్ కు ఘనంగా నివాళ్లు అర్పించిన సిపిఎం పార్టీ శ్రేణులు.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. కార్మిక ప్రజా ఉద్యమాల్లో కామ్రేడ్ టి.షడ్రక్ పాత్ర మరువలేదని భారత కమ్యూనిస్ట్ పార్టీ(మార్క్సిస్టు ) బలోపేతానికి ఆయన చేసిన కృషి అమోఘమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు, సీనియర్ నాయకులు తోట మద్దులు అన్నారు. ఆగస్టు 4 మంగళవారం టి.షడ్రక్ 6 వ వర్ధంతి సందర్బంగా నంద్యాల ఎన్ జి ఓస్ కాలనీ లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.షడ్రక్ చిత్రపటానికి లక్ష్మణ్ తోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు, సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, మౌలాలి, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె ఎం డి గౌస్, పి. వెంకట లింగం, తదితరులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.షడ్రక్ తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. షడ్రక్ కార్మిక నాయకుడిగా ఉంటూ కార్మిక వర్గాన్ని ఏకం చేయడంలోనూ, ఉద్యమాలకు నిర్మిచడంలోను ఆయనకు ఆయనే సాటన్నారు. సిపిఎం ఉమ్మడి జిల్లా సిపిఎం పార్టీ సెక్రటరీ గా ఉంటూ భూమిలేని నిరుపేదలకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిపిన భూ ఉద్యమంలో పాల్గొని అనేక మందికి భూములు సాధించాడన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ గా ప్రజాసమస్యలు సభ దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కృషిచేసి ప్రజానాయకుడి నిలిచారన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాలో కె వి పి ఎస్ ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యయనం చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఆయనది ప్రత్యేక శైలి అన్నారు. కరోనా సమయంలో ఆయన ఆకస్మత్తుగా మృతి చెందారని, ఆయన లేని లోటు పార్టీకి నష్టం కలిగించిన ఆయన చూపిన బాటలో ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయిననాడే షడ్రక్ కు నిజమైన నివాళులు అర్పించినవారమౌతమన్నారు. కార్యక్రమం లో పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, సిపిఎం సినియర్ నాయకులు రామరాజు, మాధవరావు, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ చిన్నబాలహుస్సేన్, నాయకులు సుధాకర్, వీర సేన, భాస్కర్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఎం ఆర్ నాయక్, డి వై ఎఫ్ ఐ పట్టణ కార్యదర్శి శివ, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు పాటలు పాడి కామ్రేడ్ టి.షడ్రక్ కు నివాళ్లు అర్పించారు.

## యల్లావత్తుల అంగన్వాడి 2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు..

రుద్రవరం. పల్లె వెలుగు :రుద్రవరం మండలంలోని యల్లావత్తుల2 అంగన్వాడి



కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మనోజ మాట్లాడుతూ తల్లిపాలే పిల్లలకు అమృత తుల్యమని బిడ్డ శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతాయి అన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగేలా చూడాలన్నారు. తల్లి ఇచ్చే పాలల్లో శక్తి పెంచే అంశాలు ఉంటాయని, బిడ్డ పలు రకాల వ్యాధుల బారిన పడకుండా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే అందించాలని తర్వాత మంచి పౌష్టికాహారాన్ని ఇవ్వడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. బిడ్డ ఎదుగుదలకు కావలసిన ప్రోటీన్లు, పోషకాలు, మాంసకృతులు పిండి పదార్థాలన్ని సమతుల్యంగా తల్లిపాలలో లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## వేసిన పైరును కాపాడికోండి .. వ్యవసాయా ధికారులు

బనగానపల్లె ఆగష్టు 4 ఈ ఏడు ఎల్నినో సమస్య కార్యక్రమం నిర్వహించటమైనది మరియు




"ఎలనినో" ఎదుర్కోవటం గురించి ప్రాంతీయ వ్యవసాయ పరిశోదనాస్తానం , నంద్యాల మరియు శాస్త్రవెత్తలు మరియు మహనంది వ్యవసాయ కళాశాల శాస్త్రవెత్తలు పాల్గొని రైతులలో మాట్లాడుతూ ఇప్పటి వరకే వేసిన పంటలు ఎలనినో సమస్య నుండి ఎలా కాపాడు కొవాలో తెలయ చేశారు , వర్షదార పైర్లు ను బెట్ట పరిస్థితులును ఉన్నప్పటికీ ఆడప దడప కురిసిన వర్షానికి వేసిన పైర్లను ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగహన కల్పించారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని పసుపుల, పాతపాడు మరియు యాగంటి పల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది. అధిగమించుట కొరకు 19:19:19 మరియు పోటాషియం నైట్రిట్ దావణాన్ని పైరుపై పిచికారి చేయాలని కొరియున్నారు. రబి లో ముందస్తు గా "ఎలనినో" ఎదురు కొనటానికి కంది ,ఆముదము మరియు జొన్న, సద్ద లాంటి పైర్లు వేయాలని సూచించారు.. రైతులు పెట్టుబడులను జాగ్రత్తగా పెట్టాలని వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా అధిక పెట్టుబడులు పెట్టడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని మరియు ఆర్థికంగా నష్టపోయిన ప్రమాదం ఉందని రైతులు ఈ విషయాన్ని గమనించుకొని జాగ్రత్తలు మరియు అధికారుల సూచనలు పాటించాలని చెప్పి కోరారు..

ఇందులో మహానంది వ్యవసాయ కళాశాల నుంచి డాక్టర్ .సుబ్బరామిరెడ్డి నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అశోక్ కుమార్ మరియు శాస్త్రవేత్త డాక్టర్ రవి కుమార్ రెడ్డి ,శాస్త్రవేత్త డాక్టర్ పుల్లిబాయ్ మేడం రైతు సోదరులు రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు పాతపాడు గ్రామ సర్పంచ్ శ్రీ మహేష్ రెడ్డి పాల్గొన్నారు..అదేవిధంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంటల బీమాకు ప్రీమియం చెల్లింపుల గడువు ఈనెల 15 వరకు పొడిగించబడినది ని రైతు సోదరులు అందరు కూడా పంటల బీమా చేయించుకోవాలని తెలియజేశారు.

# సామాజిక న్యాయం లేని దళిత వాడలు, దళితులను ఈ ప్రభుత్వాలు ఇంకా అంటరాని వారిగా నే చూస్తున్నాయి.




**నంద్యాల పట్టణంలోని దళితవాడలకు సామాజిక న్యాయం చేయండి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక మున్సిపల్ ఆఫీస్ ముందు దళిత శంఖారావం పేరుమీద కేవీపీఎస్,సిఐటియు, డివైఎఫ్ఐ,ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ యొక్క ధర్నాకు (కెవిపిఎస్) కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు . ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ తెలుగు ఉభయ రాష్ట్రాల కన్వీనర్ మన్యం జానయ్య , అదేవిధంగా వైయస్సార్ నగర్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు గోన సురేష్ కుమార్ , సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు , రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి రామచంద్ర ,సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కేఎండి గౌస్, పి వెంకట్ లింగం, సిఐటియు జిల్లా నాయకులు డి లక్ష్మణ్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం ఆర్ నాయక్, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలో దళితవాడలు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు గత 20 రోజుల నుంచి నంద్యాల పట్టణంలో పై సంఘాల ఆధ్వర్యంలో దళిత వాడలు పీవీ నగర్, బయటిపేట, పొన్నాపురం, నూనెపల్లి ఇందిరా గాంధీ నగర్, వైయస్సార్ నగర్, లు సర్వే చేయడం జరిగింది, యొక్క కాలనీలో దళితులకు సరైన సౌకర్యాలు నోచుకోక ఇంకా అంటగాని వారిగానే ఉన్నారు. ఎక్కడ అభివృద్ధి జరగలేదు. కాలువ లేవు, రోడ్లు లేవు, సరైన స్మశాన వాటిక లేవు, సామూహిక మరుగుదొడ్లు లేవు, తాగునీరు బాధలు ఇంకా చెప్పుకోవాల్సిన అవసరం లేదు, రెండు రోజులకు ఒకసారి,మూడు రోజులు ఒకసారి తాగునీరు వస్తున్నాయి. ఇన్ని బాధలు దళితులు పడతా ఉంటే, ప్రభుత్వాలు మాత్రం మా యొక్క ప్రభుత్వంలో సామాజిక న్యాయం జరుగుతుందని, దళితవాడలో అభివృద్ధి చెందుతున్నాయి, అన్ని రాజకీయ నాయకులు చెబుతుంటే, నిజంగా అభివృద్ధి చెందిందేమో అని మేము అనుకుంటున్నామని, క్షేత్రస్థాయిలో దళితులు అభివృద్ధికి ఆమడు దూరంలో ఉన్నారని వారు అన్నారు. పొన్న పురం ఎస్సీ కాలనీలో దళితులకు స్మశాన వాటిక లేక చనిపోయిన శవాన్ని రోడ్డు పక్కన గుంతలలోని పూడ్చాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వాలు కల్పించారని , పొన్న పురం కాలనీ పుట్టి సంవత్సరాలు అవుతున్న అక్కడ దళితులకు స్మశాన వాటిక లేదు అన్నారు. ఈ యొక్క ప్రభుత్వాలు వెంటనే దళితులకు స్మశాన వాటిక కేటాయించాలని, ఈ యొక్క సమస్యనే కాదు కాలువలు రోడ్లు, తాగునీరు సమస్య విపరీతంగా ఉందని వారు అన్నారు. ఇంకా నూనె పల్లి ఇందిరాగాంధీ నగర్ లో కాలువల సమస్య విపరీతంగా ఉందని , మున్సిపాలిటీ వాళ్ళు శుభ్రం చేయడానికి దళితవాడలో కాళ్లు కూడా పెట్టడం లేదని వారు అన్నారు. ఈ యొక్క ఎస్సీ కాలనీలో కాలువలు శుభ్రం చేయక ప్రజలు టైఫాయిడ్ మలేరియా వంటి రోగాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. తక్షణమే కాలువలు శుభ్రం చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా వైయస్సార్ నగర్ దళిత వాడాలో కాలువల్లేగా రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడుతున్న ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు . ఎస్సీలకు స్మశాన వాటిక కేటాయించిన ఆ యొక్క స్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదని , అక్కడున్న దళిత నాయకులు పాస్టర్ అసోసియేషన్ మున్సిపాలిటీ ఆఫీస్ చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. అయితే స్మశానాన్ని డెవలప్ చేసి ఇవ్వమంటే మున్సిపాలిటీ వారు ఇబ్బందులు పెడుతున్నారు. వైయస్సార్ నగర్ లో దళితులు చనిపోతే స్మశానానికి తీసుకుపోవడానికి అనేక రకాల ఇబ్బందులు పడవలసి వస్తుందని వారు వాపోతున్నారు. తక్షణమే వైయస్సార్ నగర్ స్మశాన సమస్య పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. అదేవిధంగా నంద్యాల బయటిపేటనందు మురికి కాలువలు శుభ్రం లేక ప్రజల రోగాల బారిన పడుతున్నారని అన్నారు. అక్కడ సామూహిక మరుగుదొడ్లు ఉన్నాయి కానీ నీళ్ల లేక రాత్రిపూట కరెంటు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్న ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇంకా పీవీ నగర్ దళితుల పరిస్థితి చాలా ఘోరంగా ఉందని , మున్సిపాలిటీ వారు నంద్యాలలో ఉన్న చెత్తను, హాస్పటల్లో నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను ఈ యొక్క డంపు యార్డ్ కు తరలిస్తున్నారు. రోజుకు టన్నులకొద్దీ చెత్తను

సేకరించి ఈ యొక్క డంపుకు తరలిస్తున్నారు. అయితే ఆ యొక్క డంపును తొందరగా రీసైకిలింగ్ చేయక డంపు మొత్తం పివి నగర్ వరకు పోయిందని , అక్కడ పివి నగర్ ప్రజలు ఈ యొక్క డంపు దుర్వాసన వలన అనేక రకాల జబ్బుల బారిన పడుతున్నారు. అక్కడ నివాసం ఉండలేక చాలా బాధపడుతున్నారు. అనేకమార్లు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించుకున్న వారు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ యొక్క హాస్పటల్లో న నుంచి వచ్చే సర్జికల్స్ కూడా ఇక్కడే పడేస్తున్నారని, దీని వలన పి.వి.నగర్ ప్రజలకు భవిష్యత్తులో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని , దీనికి మాత్రం బాధ్యతా మున్సిపాలిటీ వహించాల్సి వస్తుందని అన్నారు . ఇప్పటికైనా మున్సిపాలిటీ ఈ యొక్క సమస్యను గుర్తించి డంపు యార్డును పూర్తిగా ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పివి నగర్ లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించి నాలుగు సంవత్సరాలు అవుతున్న అది ఓపెన్ చేయలేదని, తక్షణమే సామూహిక మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించి ఇంకా అక్కడ రోడ్లు కాలువలు తాగునీరు సమస్య విపరీతంగా ఉందని అన్నారు . పై వాటన్నిటిమీద మున్సిపాలిటీ ప్రత్యేకంగా కేంద్రీకరించి పై సమస్యలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీరసేన, బంగారయ్య కిరణ్, ప్రజానాట్యమండలి నాయకులు బాలేవుస్సేని , మహిళా సంఘం నాయకురాలు తిరుపాలమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి జన్మదిన వేడుకలు ఘనం

**క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

**అన్నా క్యాంటీన్ వద్ద గౌరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా మాధవినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అన్నా క్యాంటీన్ వద్ద అన్నదానం:

పుట్టినరోజును పురస్కరించుకుని ఛత్రపతి శివాజీ సర్కిల్ (వై జంక్షన్) సమీపంలోని అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మరి పార్వతమ్మ ప్రజలకు స్వయంగా ఆహారాన్ని వడ్డించి, క్యాంటీన్ ద్వారా అందుతున్న సేవలపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమాలలో 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, సీనియర్ కార్యకర్త ఇమ్మానియేల్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు మధు, వెంకటేష్, బాలకృష్ణ, అన్వర్, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా: 25 మందికి కొత్త పింఛన్లు మంజూరు

- ప్రత్యేక కేసుల కింద మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ నెలలోనే పింఛను సొమ్ము పంపిణీ: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పథకం కింద జిల్లాలో ప్రత్యేక కేసులు (రాజూవఎఖుశ్రీ ఝంవం) గా సిఫార్సు చేసిన 25 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ప్రకటనలో తెలిపారు. మంజూరైన లబ్ధిదారులకు ఆగస్టు మాసంలోనే పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పింఛన్ల మంజూరు వివరాలను కలెక్టర్ వెల్లడించారు:

ప్రత్యేక పరిశీలన: ఈ ఏడాది జనవరి నుండి జూలై 10వ తేదీ వరకు పీజీఆర్ఎస్ (గ్రా+=వా), ముఖ్యమంత్రి కార్యక్రమాలు మరియు ఇతర మార్గాల ద్వారా వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాం. బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారి కుటుంబ పేదరికాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక కేసులుగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయగా ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది. కేటగిరీల వారీగా మంజూర్లు: మంజూరైన 25 పింఛన్లలో అత్యధికంగా 21 మందికి వికలాంగ పింఛన్లు, ముగ్గురికి వితంతు పింఛన్లు, ఒక్కరికి వృద్ధాప్య పింఛన్ మంజూరయ్యాయి. అర్హులైన నిరుపేదలు, బాధితులకు ఈ పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

- **వికసిత భారత్--గ్రామ్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి.**
- **వీ బీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలిలి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. వీ బీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు.. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నుంచి వి హెచ్ డి ప్లాంటేషన్, వి బి - రామ్ జి కార్యక్రమంపై అమలపై ఎంపీడీవోలు, పీడి డ్వామా, విద్యాశాఖ అధికారులు, ఎ పి డి , ఎ పి ఓ ల తో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధి జీవనోపాధి మెరుగుదల, పర్యావరణ పరిరక్షణ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హరితాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటడం, బీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జీ రామ్ జీ పథకం కింద వేతన కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, కూలి చెల్లింపులను సకాలంలో అందించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 100 వేతన కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు వారికి పని దినాలను పెంచి వారి జీవనోపాధికి తోడ్పడాలని తెలిపారు. జిల్లాలో ( వి బి జి రామ్ జి) కింద చేపట్టిన పనులను అన్ని సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, రహదారుల వెంట, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువుల పరిసర ప్రాంతాలు మరియు ఇతర అనువైన ప్రదేశాల్లో స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను నాటాలని తెలిపారు. వీ బీ రామ్ జీ పథకం కింద ఉద్యాన తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

ప్రతి గ్రామపంచాయతీలో ప్రజల భాగస్వామ్యంతో మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలన్నారు. ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు వీ బీ రామ్ జీ పథకం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యజమానులు ముందుకు రాకపోతే 29 వాహనాల వేలం: సీఐ విక్రమసింహ

- కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలు
- రవాణా శాఖ అధికారులతో వాల్యుయేషన్ పూర్తి



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న 29 ద్విచక్ర వాహనాల యజమానులు వెంటనే తమ ధ్రువపత్రాలతో సంప్రదించాలని ఫోర్త్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమసింహ తెలిపారు. నిర్ణీత గడువులోగా యజమానులు రాకపోతే ఆ వాహనాలను చట్టపరంగా బహిరంగ వేలం వేస్తామని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ వేలానికి సంబంధించిన వివరాలు: స్క్రాప్‌గా నిర్ధారణ: గత కొన్ని సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఈ 29 బైకులను రవాణా శాఖ అధికారులు పరిశీలించి, వాటి స్థితి ఆధారంగా వాల్యుయేషన్ సర్టిఫికేట్ జారీ చేస్తూ స్క్రాప్ వాహనాలుగా విలువ నిర్ధారణ చేశారు. హాజరుకావాల్సిన పత్రాలు: ఈ వాహనాల అసలు యజమానులు తమ యాజమాన్యాన్ని నిరూపించే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (=జ), ఇన్సూరెన్స్ పత్రాలు, గుర్తింపు కార్డు (×ణ ్రాతీశీశీట) మరియు ఇతర ఆధారాలతో వెంటనే కర్నూలు ×ఎ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి. బహిరంగ వేలం: యజమానులు ఎవరూ ముందుకు రాకపోతే నిబంధనల ప్రకారం త్వరలోనే ఈ వాహనాలను బహిరంగ వేలం (ూబష్ఱశీఅ) ద్వారా విక్రయిస్తామని సీఐ వెల్లడించారు.

# సాయిబాబా నగర్‌లో భవనాలపై ప్రత్యేక తనిఖీలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని 25వ వార్డు సాయిబాబా



నగర్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న ఆధ్వర్యంలో ప్రత్యేక భవన తనిఖీలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని ప్రాంతంలోని వివిధ నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళికల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. నిర్మాణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ప్రజలు భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు మున్సిపాలిటీ నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, ఆమోదిత ప్రణాళిక మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టడం ద్వారా పట్టణం క్రమబద్ధమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# లేఅవుట్లలో ఆక్రమణల తొలగింపు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు మంగళవారం ఉక్కుపాదం మోపారు. కమిషనర్ బి. శేషన్న ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించారు. పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 348/52లో 6.27 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, జేసీబీల సహాయంతో వాటిని తొలగించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. శేషన్న మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి ఆక్రమణలనూ ఉపేక్షించబోమన్నారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలతో పాటు, అక్రమ నిర్మాణాల తొలగింపు ఖర్చును కూడా సంబంధిత వారినుంచే వసూలు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని, పట్టణంలోని అన్ని లేఅవుట్లలో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# పంటల బీమాపై రైతులకు అవగాహన.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలంలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో 'పొలం



పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 15వ తేదీలోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. వరి, మొక్కజొన్న, కంది, మినుము, మిరప తదితర పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్నకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మినుము, కంది, పెసర వంటి పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని పెంచేందుకు పీఎండీఎస్ విత్తనాలను వెదజల్లాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సాలమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి బాలలింగమయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాల వార్షికోత్సవాలు

### సూపర్వైజర్ ప్రీతి,,,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 4 ఎమ్మిగనూరు మండలంలో పెసలదిన్నె గార్లదిన్నె గ్రామాల్లో అంగనవాడి సెంటర్ల టీచర్లు తిప్పమ్మ, రంగమ్మ అధ్యక్షతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లిపాల వార్షికోత్సవం నిర్వహించారు సూపర్వైజర్ వైలప్రీతి

ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడే పుట్టినటువంటి పిల్లలకు మురిపాలు పట్టించడం తల్లిపాలలో ఉన్న ఆరోగ్య ప్రయోజనాల పై గర్భవతులకు అవగాహన కల్పించారు పుట్టిన గంటలోపు తల్లి పాలు తాగడం వలన రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని గర్భిణీలు బాలింతలు పోషక విలువలు కలిగినటువంటి ఆహారాన్ని తీసుకున్నప్పుడే బిడ్డలు ఆరోగ్యం వంతంగా ఉంటారని వారు తెలిపారు అదేవిధంగా ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారు బలంగా ఉండటానికి మంచి పోషకాలైనటువంటి వివిధ రకమైనటువంటి కిట్లను కూడా పంపిణీ చేయడం జరుగుతుంది శ్రీ బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది అని వారు అన్నారు గర్భిణీ స్త్రీ లతో ప్రతిజ్ఞ చేశారు

# రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**● రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ప్రభుత్వ లక్ష్యం. ● రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి. ● ప్రస్తుత పరిస్థితుల్లో వరి కంటే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాయలసీమ ప్రాంత సమగ్ర అభివృద్ధితో పాటు సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గోరుకల్లు జలాశయానికి గతంలో చేపట్టిన పనులను ప్రస్తుతం మరింత బలోపేతం చేస్తూ రూ.53 కోట్లతో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టినట్లు తెలిపారు. రిజర్వాయర్‌లో లీకేజీల నివారణ కోసం రూ.54 కోట్లతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలగనూరు రిజర్వాయర్‌కు గతంలో ప్రతిపాదించిన మరమ్మతుల కంటే ప్రస్తుతం విస్తృత స్థాయిలో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. శ్రీశైలం, గోరుకల్లు, అలగనూరు తదితర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ.610 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాయలసీమకు కృష్ణా జలాలను సమర్థవంతంగా అందించేందుకు అవుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, హంద్రీ-నీవా, గండికోట, ఎస్ఆర్‌బీసీ వంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

2024-25 సంవత్సరంలో గండికోటకు 60 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీకి 7 టీఎంసీల నీటిని అందించామని, 2025-26లో కూడా ఎస్ఆర్‌బీసీకి 6 టీఎంసీల నీటిని విడుదల చేసి సాగుతో పాటు పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాను కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. దీంతో పరిశ్రమలు, సిమెంట్ కర్మాగారాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై గత రెండేళ్లలో రూ.12,484 కోట్లు ఖర్చు చేశామని, 2026-27 బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో రూ.35,313 కోట్లతో 36 ప్రాధాన్యత ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, వాటిలో 14 ప్రాజెక్టులు రాయలసీమకు చెందినవేనని వివరించారు.

***రాయలసీమ హార్టీకల్చర్ కోసం లక్ష కోట్ల రూపాయలతో ప్రాజెక్టు తయారవుతోందన్నారు. తుంగభద్ర గేట్లను 5 రోజుల్లో బిగించి 30 టిఎంసిల నీటిని కాపాడడం జరిగిందని మంత్రి వివరించారు. జిల్లాలో డ్రోన్ హబ్, గోరుకల్లు దగ్గర ఇండస్ట్రియల్ హబ్... అనేకమైన పరిశ్రమలు వస్తున్నాయని, బనగానపల్లె నియోజకవర్గంలో అల్ట్రాటెక్ సెకండ్ యూనిట్ ను దాదాపుగా 4,000 కోట్లతో కొలిమిగుండ్లలో ఏర్పాటు చేస్తున్నామని, రామ్కో విస్తరణ కూడా చేపట్టడం జరుగుతోందని మంత్రి తెలిపారు.***

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, శ్రీశైలం జలాశయం పూర్తి సామర్థ్యం 885 అడుగులు (215 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా 860 అడుగుల (105 టీఎంసీలు) వరకు నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఏడాది పొడవునా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగించేందుకు సుమారు 9 టీఎంసీల నీరు అవసరమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నింపి తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వరి సాగుకు అవసరమైనంత సాగునీరు అందుబాటులో లేకపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మినుము, కంది, పెసర, జొన్న, కొర్రలు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఏ గ్రామానికీ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, ఏ రైతుకూ ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు.

---

# గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయండి..

**☛ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**

**☛మహానంది ట్రస్ట్ బోర్డు కాశి నాయక్ కు ఘన సత్కారం..**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ఉన్న గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ తీసుకొని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కారం దిశగా కృషి చేసేందుకు తోడ్పాటు అందించాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. మహానంది దేవస్థానంలో పాలకమండలి ట్రస్ట్ బోర్డు సభ్యుడుగా ముస్తపల్లి గ్రామానికి చెందిన కాశీ నాయక్ కి దక్కడం యావత్ గిరిజన జాతికి అరుదైన గౌరవం దక్కిందని జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మహానంది పాలకమండలి సభ్యుడుగా ఎన్నికైన శుభ సందర్భంగా జిపిఎస్ కార్యాలయ ఆవరణంలో అన్ని సంఘాల నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు నాయక్, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను గుర్తించి దేవాదాయ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ



ధర్మాదాయ శాఖ దేవస్థానంలో సేవ చేసుకునేందుకు చక్కటి అవకాశం కల్పించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అదేవిధంగా మహానంది దేవస్థానంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవనోపాధికి ప్రభుత్వం కల్పించాలన్నారు. అనంతరం ట్రస్ట్ బోర్డు సభ్యుడుగా ఎన్నికైన కాశీ నాయక్ కి సంఘం కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, ఏఐబీఎస్ఎస్ బాల నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు జవహర్ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్ బాలాజీ నాయక్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు నాగ స్వామి నాయక్, హనుమంతు నాయక్, ముష్టపల్లి గ్రామ నాయకులు రామ్ నర్సయ్య వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలపై కఠిన చర్యలు.

**ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు: కమిషనర్ బి. శేషన్న.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల పురపాలక సంఘం కమిషనర్ బి. శేషన్న హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పలు సర్వే నంబర్లలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు పురపాలక సంఘం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సంబంధిత భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నవేనని, వాటిపై ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేయడం, విక్రయించడం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

ఈ అక్రమ లేఅవుట్లపై ఇప్పటికే పట్టణ ప్రణాళిక విభాగానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సంబంధిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లను పూర్తిగా తొలగించి (డెమాలిష్) చేయనున్నట్లు వెల్లడించారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ అనుమతి లేని లేఅవుట్లలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ప్లాటు కొనుగోలు చేసే ముందు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి వివరాలు తెలుసుకుని, చట్టబద్ధ అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కోరారు.

అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ భూములను ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బి. శేషన్న హెచ్చరించారు. ప్రజలు చట్టబద్ధమైన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేసి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించిన,

## ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 4 ప్రజలకు



మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభించిన సర్వీసుల్లో ఎమ్మిగనూరు విజయవాడ సూపర్ లగ్జరీ బస్సు మరియు ఎమ్మిగనూరు ఆదోని పల్లెవెలుగు బస్సు ఉన్నాయి. ఏపీఆర్ఎస్ మరియు ఏపీఆర్జేసీ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రత్యేక విజ్ఞప్తి మేరకు



ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు మరియు సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులు, మెరుగైన రూట్లు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, టీడీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీకి కోతలు ప్రజలపై భారంగా మారుతున్నాయి:

## మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల,ఆగస్టు 4: (పల్లె వెలుగు) రాష్ట్రంలో



ఆరోగ్యశ్రీ పథకానికి కోతలు విధించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల్లో ఆరోగ్యశ్రీ పథకం బలహీనపడే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలకు అత్యంత అవసరమైన కొన్ని వైద్య విధానాలను ఆరోగ్యశ్రీ పరిధి నుంచి తొలగించే దిశగా చర్యలు జరుగుతున్నాయని, సాధారణ సిజేరియన్ ప్రసవాలు, కొన్ని కంటి వైద్య (ఆప్తాల్మాలజీ) చికిత్సలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా పొందే అవకాశం తగ్గుతోందని పేర్కొన్నారు.
ఆరోగ్య ఆసరా పథకం నిలిపివేయడం వల్ల గత రెండేళ్లలో లబ్ధిదారులకు భారీ నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అలాగే అనేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోవిడ్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత కారణంగా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని విమర్శించారు.
గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బందిని నియమించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచారని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీపై ప్రభుత్వ వ్యయం గత ప్రభుత్వాలతో పోలిస్తే తగ్గిందని పేర్కొంటూ, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని పలు రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు.

# అభ్యర్థులు గెలిపే కీలకం.

## బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్.



ఆదోని (పల్లె వెలుగు): ఎన్డీయే పార్టీల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గెలుపే కీలకంగా పరిగణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిజెపి ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. సోమవారం ఆదోని సెంట్రల్ మండలంకు సంబంధించిన పదాధికారుల సమావేశం మండల అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షత జరగదు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ లెవెల్లో పార్టీ పటిష్టతతో పాటు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ విస్తరణ ప్రథమ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సమావేశంలో మండల ఇన్చార్జి లోకేష్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు రమేష్ ఆచారి, ప్రశాంత్, ఉపాధ్యక్షులు చిన్నబస్తప్ప గోల్డ్ రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో సబ్సిడీపై సన్న బియ్యం పంపిణీ.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని విశాల్ మార్ట్ నందు సబ్సిడీ సన్న బియ్యం





పంపిణీని ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు బిజెపి సీనియర్ నాయకులు నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. రేషన్ కార్డుపై కిలో రూ.50 చొప్పున నెలకు 10 కిలోల బియ్యాన్ని ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన షాపుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు నాగరాజు గౌడ్ తెలిపారు. ఆదోని పట్టణములోని ఈ క్రింద తెలిపిన విశాల్ మార్ట్, మోర్ సూపర్ మార్కెట్, స్మార్ట్ బజార్, రైతు బజార్, డి మార్ట్ లో సోనా మసూరి బియ్యం అందుబాటులో ఉంటాయన్నారు. ఆదోని నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి టి రుద్ర గౌడ్, ఆర్ ఐ లక్ష్మన్న, బిజెపి నాయకులు నాగార్జున, మధుసూదన్ శర్మ, చెన్న బసప్ప, కోసిగయ్య, రమేష్ ఆచారి, ఉరుకుంద గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ దేయం.

## కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ.



ఆదోని (పల్లె వెలుగు): కూటమి ప్రభుత్వ రెండేళ్ల చేసిన అభివృద్ధి కార్యక్రమాలని ప్రజలకు వివరించిన ఉమాపతి నాయుడు ఈరోజు ఆదోని నియోజకవర్గం మండగిరి పంచాయతీలో కూటమి ప్రభుత్వం రెండేళు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆదోని టిడిపి ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార (డోర్ టు డోర్) కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ ముఖ్య అతిథిగా డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి విశేష ఆదరణ చూపిస్తూ తమ సమస్యలను తెలియజేస్తున్నారని, వాటి పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ శారద భాయ్, రంగస్వామి నాయుడు, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, జిందే శంకర్, గుడిసె శ్రీరాములు, రంగన్న, మండల అధ్యక్షులు శివప్ప, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండగిరి పంచాయతీ నాయకులు శ్రీనివాస్ చౌదరి, చాంద్ బాషా, మురళి, అనిమిరెడ్డి, నాగన్న, బాబురావు, ఆటో రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రాటెక్ సిమెంట్ మైనింగ్‌పై గ్రామస్థుల తీవ్ర అభ్యంతరం

## -అనుమతులకు మించి తవ్వకాలు,జరుగుతున్నాయంటూ ఆరోపణలు




కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (పల్లె వెలుగు న్యూస్) ప్రతినిధి మహేష్:-నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నీకోట మజారా గోరివిమానిపల్లి గ్రామ పరిధిలో అల్ట్రాటెక్ సిమెంట్ మైనింగ్ కార్యకలాపాలపై గ్రామస్థులు, రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎన్. సూర్యుడు 13-07-2026న ౢా+=ూ ద్వారా పర్యావరణ శాఖకు ఫిర్యాదు చేయగా, మంగళవారం సంబంధిత అధికారులు విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 884లో 19 ఎకరాలకు మాత్రమే లీజ్ ఉన్నప్పటికీ, 896 సర్వే నంబరులో కూడా మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. వాగును రహదారిగా వినియోగిస్తూ భారీ వాహనాలతో ఖనిజ రవాణా జరుగుతోందని తెలిపారు. ఈ మైనింగ్ కారణంగా వర్షపు నీరు కలుషితమై లోక్కిగుండం రమేశ్వరస్వామి, కాశినాయన ఆంజనేయస్వామి, నరసింహస్వామి దేవాలయాలకు వచ్చే భక్తులతో పాటు అయ్యవారిపల్లి రైతులు వినియోగించే సాగునీటిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల 884 సర్వే నంబరులోని లీజ్‌ను వెంటనే రద్దు చేసి, 896 సర్వే నంబరులో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న మైనింగ్‌పై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖ అధికారులను కోరారు. ఈ విచారణలో కర్నూలు పర్యావరణ శాఖ అధికారులు, ఏఈ కిషోర్ రెడ్డి, ఏఈ కృష్ణ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ మైన్స్ ప్రతినిధి ఎఫ్.హెచ్. నాగసిద్ధారెడ్డి, ఎన్. సూర్యుడు, కొలిమిగుండ్ల మండల సీపీఐ కార్యదర్శి సూరి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

# కలచట్ల, ఎస్.రాయంపేట గ్రామాల్లో జోరుగా 'డోర్ టు డోర్' ప్రచారం

పల్లె వెలుగు -?ప్యాపిలి డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



శ్రీమతి కోట్ల సుజాతమ్మ, నియోజకవర్గ యువ నాయకులు కోట్ల రాఘవేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు ప్యాపిలి మండలంలో తెలుగుదేశం పార్టీ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. మంగళవారం ప్యాపిలి మండలం కలచట్ల గ్రామపంచాయతీ పరిధిలోని కలచట్ల, ఎస్.రాయంపేట గ్రామాలలో డోర్ టు డోర్ (ఇంటింటి ప్రచారం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ?ప్యాపిలి మండల టిడిపి సీనియర్ నాయకులు బత్తుల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.?ఈ సందర్భంగా బత్తుల రమేష్ రెడ్డి మాట్లాడుతూ కోట్ల కుటుంబం అడుగుజాడల్లో డోన్ నియోజకవర్గ అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ అందించేలా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, రామాంజినేయులు, బీమన్నా పాల్గొన్నారు.

# తోట శివారెడ్డి కుటుంబ పెద్దమ్మ తల్లి మొక్కుబడి

## కార్యక్రమానికి హాజరైన బీసీ ఇందిరా రెడ్డి



కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (పల్లె వెలుగు న్యూస్) రిపోర్టర్ మహేష్ :-నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తోట శివారెడ్డి కుటుంబంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి మొక్కుబడి కార్యక్రమానికి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో కుటుంబ సభ్యులందరూ,సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కుబడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# మెగా డీఎస్సీ పై సీబీఐ విచారణకు హైకోర్టు నిరాకరణ.

ఆదోని (పల్లె వెలుగు): 2025 మెగా డిఎస్సి పై అభ్యర్థులు కాకుండా రాజకీయ నాయకులు




కోర్టుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉంది. గత ఏడాది ప్రభుత్వం పదహారు వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా అందులో పీఈటి పోస్టులు కేవలం 177 ఉండగా వాటి భర్తీ పై తమకు అనుమానాలు ఉన్నాయి అంటూ వైసిపి నాయకులు మొత్తం డీఎస్సీ పైనే విమర్శలు చేయడం కోర్టుకు వెళ్లడం సిగ్గుచేటు దీన్ని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ ప్రకటించకపోవడంతో సుమారు ఏడేళ్ల వ్యవధి తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించి అత్యుత్తమమైన ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం చారిత్రకం. కాబట్టి స్వచ్ఛమైన 2025 మెగా డీఎస్సీ పై బురద జల్లే కార్యక్రమం మానుకోవాలని లేదంటే యువత, విద్యార్థులు మరియు నిరుద్యోగ యువత ఆగ్రహానికి గురి కాకతప్పదని డీఎస్సీ వ్యతిరేకులను హెచ్చరిస్తున్నాము.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

## పెద్దపులి మృతి ఘటనలో మహానందికి చెందిన వ్యక్తులు.



మహానంది, పల్లె వెలుగు మార్కాపురం జిల్లా గిద్దలూరు డివిజన్ పరిధిలోని రాచర్ల బీట్లో మృతి చెందిన పెద్దపులి ఘటనలో మహానంది గ్రామంలోని ఈశ్వరనగర్ చెందిన వ్యక్తిని అటవీశాఖాధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా తెలిపారు. మంగళవారం గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ నిషా కుమారి మాట్లాడుతూ... పెద్దపులి మృతి ఘటనకు సంబంధించిన కేసులో 7 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి అరెస్ట్ చేశారన్నారు.నిందితుల నుంచి 7 పులి గోర్లు, ఎముకలు, ఒకనాటు తుపాకీ, గొడ్డలి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ పెద్దపులి మృతిపై స్పందించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేయించిన హనుమాన్ టీం ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు సేకరించి త్వరగా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో మరి కొందరి ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ప్రజా పోరాటాల ఉద్యమ నేత కామ్రేడ్ షడ్రక్ వర్ధంతి.

**ఆదోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు.**

ఆదోని (పల్లె వెలుగు): ప్రజా పోరాటాల ఉద్యమ నేత కామ్రేడ్ షడ్రక్ ఆరవ వర్ధంతి



సందర్భంగా ఆదోని పట్టణంలోని సిఐటియు కార్యాలయం నందు సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కన్న అధ్యక్షతన జరిగింది. షడ్రక్ చిత్రపటానికి సిపిఎం పట్టణ, మండల కార్యదర్శిలు లక్ష్మన్న, లింగన్న పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న నాయకులు నాగరాజు,హనుమంత రెడ్డి,రాజు,మల్లయ్య,ముని, నేతప్ప,ఆటో కార్మికులు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మన్న,లింగన్న వీరు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో పేపర్ మిల్లు కార్మికుడిగా తన జీవితాన్ని కొనసాగించిన షడ్రక్ పేపర్ మిల్లులో ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం అనేక పోరాటాలు నిర్వహిస్తూ కార్మిక వర్గానికి అండగా ఉండే వారిని వారు తెలిపారు. ఈ పోరాటంలో యజమాన్యం ఉద్యోగాన్ని తొలగించిన ఎక్కడ తలగ్గకుండా ఆ పోరాట స్ఫూర్తితో కర్నూలు జిల్లాలో ప్రజలు, కార్మికులు,రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం ప్రభుత్వానికి తెలిసే పద్ధతుల్లో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారని వారు గుర్తు చేశారు. అదేవిధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికై త్రాగు,సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం కొరకు పాదయాత్రల ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించారని వారు తెలిపారు. షడ్రక్ ఉద్యమ స్ఫూర్తితో ప్రస్తుతం ప్రభుత్వంలో అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్తూ మరిన్ని ప్రజా పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని వారు తెలిపారు.

## ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి.

*-బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,) బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాల్మీకి దస్తగిరి నాయుడు.*

ఆదోని (పల్లె వెలుగు): మొన్న జరిగినటువంటి చిప్పగిరి మండలం సంఘాల గ్రామంలో



ఇరువర్గాలమధ్య ఘర్షణ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు సంఘాల గ్రామానికి వెళ్లి వాళ్ల కార్యకర్తలను పరామర్శించి తిరిగి వస్తుండగా నేమకళ్ గ్రామం నందు టిడిపి కార్యకర్తలు అడ్డుకొని ఆ సందర్భంలో వచ్చినటువంటి శాసనసభ్యులు విరుపాక్షి మీద దాడి చేయడం హే ఏమైనా చర్య, దానిపైన పోలీస్ స్టేషన్ కి కంప్లైంట్ ఇవ్వడానికి వెళ్ళినా కూడా పోలీసులు కేసు నమోదు చేయకపోగా, అక్కడే కూర్చోబెట్టడం జరిగింది, అధికారులకు ఫోన్ చేస్తే కూడా ఎవరు లిఫ్ట్ చేయలేదు, చేసేది ఏం లేక తిరిగితన స్వగ్రామమైన చిప్పగిరికి పోవడం జరిగింది, ఆ తర్వాత విరుపాక్షి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి రాత్రి 2-45 నిమిషాలకు చిప్పగిరి గ్రామానికి వెళ్లి అతని స్వగృహం నందు నిద్రపోయే వ్యక్తిని తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసి తీసుకొని రావడం జరిగింది. ఇంత దారుణంగా రాత్రికి రాత్రి ఎమ్మెల్యే హోదా కలిగినటువంటి వ్యక్తిని నిర్ధాక్షణంగా తీసుకురావడం జరిగింది. కావున విరుపాక్షి పైన పెట్టినటువంటి కేసులను సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారి పైన కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడమైనది. ఈ సమావేశంలో ఆర్. రామకృష్ణ, చిన్న ఈరప్ప, ఆర్. వి. బాబు, మదిరే ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో చెక్‌డ్యామ్ కూల్చివేత కలకలం

**☛ప్రభుత్వ చెక్‌డ్యామ్‌ను నేలమట్టం చేసిన రియల్టర్లు?**

**☛ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం -- ప్రభుత్వ భూమిలో ప్రీకాస్ట్ వాల్ నిర్మాణంపై విమర్శలు**






కీసర, ఆగస్టు 4 (పల్లె వెలుగు): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలో ప్రభుత్వ చెక్‌డ్యామ్ కూల్చివేత వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 393లో ప్రభుత్వం గతంలో గుట్టలపై నుంచి వచ్చే వర్షపు నీటిని నిల్వ చేయడం కోసం నిర్మించిన చెక్‌డ్యామ్‌ను రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం కూల్చివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం ఆ ప్రాంతాన్ని ప్లాట్ల విక్రయానికి సిద్ధం చేస్తున్నారని స్థానిక రైతులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలు, జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల నివారణ కోసం ఏర్పాటు చేసిన గ్రామస్థాయి యంత్రాంగం కూడా సమర్థంగా పనిచేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.ఇటీవలే సర్వే నంబర్ 181లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రీకాస్ట్ వాల్ నిర్మించిన ఘటనలో కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ, ఆక్రమణలపై పూర్తి స్థాయి చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ప్రభావశీలుల విషయంలో అధికారులు మౌనం పాటిస్తుండగా, సాధారణ ప్రజల విషయంలో మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.ఈ ఘటనపై స్పందించిన కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి, చెక్‌డ్యామ్ కూల్చివేసిన విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ కూల్చివేయబడిన విషయం వాస్తవమేనని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని చెప్పారు. చెక్‌డ్యామ్‌ను కూల్చిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఘటనలో ఉపయోగించిన జేసీబీని కూడా స్వాధీనం (సీజ్) చేస్తున్నామని వెల్లడించారు.ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత శాఖల బాధ్యులపై కూడా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

**20 లక్షలు తో నిర్మించిన భవిత భవనాన్ని ప్రారంభించిన**







ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగష్టు4 పల్లె వెలుగు కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తి ఉండదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం నాడు ఎమ్మెల్యే డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రజలతో మమేకమై ఆత్మీయ పలకరింపుతో క్షేమ సమాచారాలు అడుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి మరియు ఆళ్లగడ్డలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరిస్తూ ముందుకు సాగారు
అనంతరం ప్రభుత్వం తరఫున ఆరు మండలాలకు సంబంధించి 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన భవిత నూతన భవనాన్ని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భవిత భవనంలో 22 మంది పిల్లలు, ఇద్దరు టీచర్స్ మరియు ఆయా ఉంటారన్నారు, పిల్లలందరికీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.
ఈ భవిత భవనంలో వికలాంగుల పిల్లలందరికీ ప్రభుత్వం ద్వారా ఇద్దరు టీచర్స్ మరియు ఆయా, అన్ని సౌకర్యాలతో పిల్లలను చూసుకోవడం అనేది చాలా ఆనందంగా ఉందని ప్రభుత్వం ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం వల్ల పిల్లలు చదువుల్లో ఇంకా ముందుకు వెళ్తారని అన్నారు
ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి ఆర్ టి జి సెంటర్ 40 లక్షల రూపాయలతో మంజూరు అయిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శోభా వివేకవతి మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష నాగాంజనేయులు, శేఖర్ రెడ్డి ,ప్రసాద్ రెడ్డి ,టిడిపి నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి

**నేటి మొక్కలే రేపటి వృక్షాలు**

**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**







ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగష్టు 4 పల్లె వెలుగు నేటి మొక్కలే రేపటి వృక్షాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.మంగళవారం నాడు ఆళ్లగడ్డ పట్టణ సమీపంలోని టిడ్కో గృహాల వద్ద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్థానిక నివాసితులకు మొక్కలను పంపిణీ చేస్తూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని ఆమె పిలుపునిచ్చారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, "పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. నేడు మనం నాటే ఒక మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే పచ్చని ఆళ్లగడ్డ నిర్మాణం సాధ్యమవుతుంద ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.
పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

# పర్యావరణకు మొక్కలే శరణ్యం

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

**పోలీస్ అధికారులను సిబ్బందిని అభినందించిన**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 4 పల్లె వెలుగు





పర్యావరణకు మొక్కలే శరణ్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు .మంగళవారం నాడుఆళ్లగడ్డ పట్టణంలోని టిట్కో నివాస గృహాల వద్ద జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు సీఐ నాగరాజురావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని పట్టణ సీఐ నాగరాజారావు పోలీసు సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించిన పట్టణ సీఐ నాగరాజరావు పోలీస్ సిబ్బందిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించారు.